నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 23 ఫిబ్రవరి 2025 | HYDERABAD

తాను మరణిస్తూ..మరికొందరికి వెలుగు

ఓరుగంటి సుధాకర్ (ఫైల్)

ఖైరతాబాద్, ఫిబ్రవరి 22 : తాను మరణించినా పలువురి జీవితాల్లో వెలుగులు నింపాడో వ్యక్తి. జీవన్‌దాన్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీభూషణ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా బోడుప్పల్ హేమానగర్కు చెందిన ఓరుగంటి సుధాకర్ (54) ఓ ప్రైవేట్ దవాఖానలో ఆపరేషన్ టెక్నిషియన్‌గా పనిచేస్తున్నాడు. వారం రోజుల కిందట విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా, అపస్మారక స్థితిలో కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా, చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 21న బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. జీవన్‌దాన్ కౌన్సిలింగ్‌తో కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు సుధాకర్ శరీరం నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలను సేకరించారు.

రైతులకు అందని బోనస్

మేడ్చల్, ఫిబ్రవరి22(నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లాలో వానాకాలంలో సాగు చేసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం 13 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కొనుగోలు కేంద్రాల ద్వారా 5,453 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించింది. అయితే ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించిన క్రమంలో రైతులు రైస్ మిల్లర్లకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో సన్న వడ్లను విక్రయించారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు డబ్బులతో పాటు బోనస్ డబ్బులు అందిస్తామని ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పిందని రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో కొనుగోలు చేసిన సన్న వడ్లకు రూ. 42 లక్షల బోనస్ చెల్లించాల్సి ఉండగా ఇందులో సగం మంది రైతులకు మాత్రమే బోనస్ చెల్లించారు. మిగతా రైతులకు రూ. 22 లక్షలు చెల్లించాల్సి ఉంది.

మసకబారుతున్న 'స్వచ్ఛ హైదరాబాద్'

నగరంలో పారిశుధ్యం పడకేసింది. 'స్వచ్ఛ హైదరాబాద్' ఖ్యాతి మసకబారుతున్నది. నగరంలో ఎక్కడా చూసినా.. చెత్తకుప్పలే కనిపిస్తున్నాయి. రహదారుల వెంట వ్యర్థాలు పేరుకుపోతుండటంతో అటు వాహనదారులు, ఇటు పాదచారులు అవస్థలు పడుతున్నారు.

భూసేకరణ కాకుండానే.. టెండర్లా?

కేబీఆర్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి బల్దియా చర్యలు

భూసేకరణపై క్లారిటీ రాకుండానే.. టెండర్లు పిలిచిన వైనం

వీఐపీ జోన్ కావడంతో భూసేకరణపై వీడని సందిగ్ధం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా చెప్పుకుంటున్న కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం గందరగోళంగా మారింది. నిజానికి ఏ ప్రాజెక్టు అయినా మొదలుపెట్టాలంటే.. ముందుగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి, ఆ తర్వాత పనులు చేపట్టేందుకు టెండర్లను పిలుస్తారు. కానీ ఈ ప్రాజెక్టు విషయంలో కేవలం హడావుడి చేసేందుకు భూసేకరణపై స్పష్టత రాక ముందే.. పనులు చేపట్టేందుకు టెండర్లను జీహెచ్ఎంసీ ఆహ్వానించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రెండు ప్యాకేజీల్లో కేబీఆర్ పార్క్ ఎంట్రెన్స్ గేటు నుంచి జూబ్లీ చెక్ పోస్టు వరకు, బసవ తారకం హాస్పిటల్ మీదుగా అగ్రసేన్ విగ్రహం మీదుగా అండర్ పాస్, ఫ్లై ఓవర్లను రూ.1090 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు బల్దియా టెండర్లు పిలిచింది. ఫిబ్రవరి 27 నుంచి టెండర్ ప్రక్రియ మొదలు కానుండగా, మార్చి 26తో ప్రక్రియ ముగించేందుకు బల్దియా చర్యలు చేపట్టింది. అయితే అత్యంత కీలకమైన ఈ ప్రాజెక్టులో భూసేకరణపై ఎలాంటి స్పష్టత రాకుండా పనులు ఎలా మొదలుపెడతారనేది ఆసక్తిగా మారింది.

దాదాపు 150 నివాసాలు

హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్కు ఫ్లై ఓవర్లు, అండర్ పాసుల నిర్మాణంలో అత్యంత క్లిష్టమైనది భూ సేకరణ ప్రక్రియ. వాస్తవంగా ఏ ప్రాజెక్టు మొదలుపెట్టాలన్నా.. ముందు భూసేకరణ పూర్తి చేసిన తర్వాతనే.. పనులు చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానిస్తారు. కానీ ఈ ప్రాజెక్టు విషయంలో క్లారిటీ లేకుండానే హడావుడిగా టెండర్లను పిలవడం ఎందుకనేది ఇప్పుడు చర్చ నడుస్తోంది. ప్రస్తుతం పాత రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్(ఆర్‌డీపీ) పరిగణనలోకి తీసుకుని కొత్త ఆర్‌డీపీ ప్లాన్ సిద్ధం చేశారు. గత ఆర్‌డీపీలో దాదాపుగా 105 నివాసాలు ఉన్నట్లు తేలింది. అయితే ఈ నివాసాల నుంచి ఆస్తుల స్వాధీనం అధికారులకు తలకు మించిన భారమేనని చెప్పాలి. అంతే కాకుండా భూసేకరణపై ఇప్పటికే వివిధ న్యాయస్థానంలో మూడు కేసులు ఉండడం వీటిపై ఎలాంటి క్లారిటీ రాకుండానే టెండర్లను పిలవడం వెనుక అంతర్యమేమిటనేది తెలియాల్సి ఉంది.

కొలిక్కి రాని భూసేకరణ..

బంజారాహిల్స్ రోడ్ నం. 12 నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు భూసేకరణలో భాగంగా పలు భవనాలను మార్కింగ్ వేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నం. 92లో నివసించే మాజీ మంత్రి జానారెడ్డి రోడ్డు విస్తరణలో భాగంగా తన ప్లాట్ నుంచి 600 గజాల స్థలాన్ని కోల్పోనున్నారు. ఆయన ఇంటికి వేసిన మార్కింగ్ ప్రకారం ఆయన ప్లాట్‌లో సగభాగం విస్తరణలో కోల్పోనుంది. ఇక జూబ్లీహిల్స్ రోడ్ నం. 45లో ఉన్న హీరో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇంటికి కూడా మార్కింగ్ వేశారు. సుమారుగా తన ప్లాట్‌లో 500 గజాల వరకు కోల్పోనున్నారు. మాజీ మంత్రులు సమర సింహారెడ్డి, షబ్బీర్ అలీ, కేఈ కృష్ణమూర్తి, రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి, హీరో అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి వంటి ప్రముఖుల ఇండ్లకు కూడా మార్కింగ్ వేశారు. బంజారాహిల్స్ రోడ్ నం. 12 విరించి ఆసుపత్రి నుంచి అగ్రసేన్ చౌరస్తా వరకు ప్రస్తుతం 80 అడుగుల రోడ్డు ఉంది. దీనిని 100 అడుగుల మేర విస్తరించనున్నారు. ఈ రోడ్డుకు రెండు వైపులా ఆస్తులు సేకరణ చేపట్టాలని నిర్ణయించారు. 86 నివాసాలకు మార్కింగ్ చేశారు. కానీ ఏ ఒక్క ఆస్తిని కూడా అధికారులు స్వాధీనం చేసుకోలేదు. దీంతో భూసేకరణ కొలిక్కి రాకుండానే ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నట్లుగా చెప్పుకోవడానికే తాజా టెండర్లు పిలవడానికి గల కారణమని బల్దియాలో చర్చ నడుస్తోంది.

బంజారాహిల్స్ రోడ్ నం. 10లో జలమండలి స్థలం వద్ద బోర్డును తొలగించి జెండా ఏర్పాటు చేసిన దృశ్యం

రూ.150 కోట్ల విలువైన స్థలంపై మరోసారి కన్ను

హెచ్చరిక బోర్డు తొలగింపు

జలమండలి స్థలం ఆక్రమణకు యత్నం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22: జలమండలి రిజర్వాయర్ కోసం కేటాయించిన రూ.150కోట్ల విలువైన స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తుండడంతో పాటు స్థలం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న హోంగార్డును బెదిరింపులకు గురిచేస్తున్న వ్యక్తిపైతోపాటు అతడి అనుచరులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదయింది. వివరాల్లోకి వెళ్తే.. షేక్‌పేట మండలం సర్వే నెంబర్ 403 పి లోకి వచ్చే బంజారాహిల్స్ రోడ్ నెం 10లోని తట్టిఖానా జల మండలి కార్యాలయం పక్కన 1.20 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని జలమండలి రిజర్వాయర్ కోసం ప్రభుత్వం 1998లో కేటాయించి పంచనామా చేసి అప్పగించింది. అప్పటినుంచి జలమండలి ఆధీనంలో ఉన్న సదరు స్థలంలోకి గత కొంతకాలంగా పరశరామ్ పార్థసారథి అనే వ్యక్తి బోగస్ పత్రాలతో ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నాడు. జలమండలికి కేటాయించిన స్థలం తనది అంటూ వాదిస్తున్నాడు. ఇటీవల ఈ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించిన పార్థసారథి వ్యవహారాన్ని నమస్తే తెలంగాణ వరుస కథనాలతో బట్టబయలు చేయడంతో రెవెన్యూ, జలమండలి అధికారులు రంగంలోకి దిగి స్థలంలో ఆక్రమణలను తొలగించారు. జలమండలికి కేటాయించిన 1.20 ఎకరాల స్థలం చుట్టూ సరిహద్దు రాళ్లు పెట్టుకోవడంతో పాటు స్థలం కబ్జా కాకుండా జలమండలి విజిలెన్స్‌కు చెందిన సిబ్బందిని కాపలా పెట్టారు. ఈ నేపథ్యంలో ఈనెల 20న పార్థసారథితో పాటు అతడి మనుషులు స్థలం వద్దకు వచ్చి అక్కడ జలమండలి ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను తొలగించారు. స్థలం బయట జెండాలు ఏర్పాటు చేయడంతో పాటు అక్కడున్న జలమండలి విజిలెన్స్ హోంగార్డు కే.రాఘవేందర్‌కు ఫోన్ చేసిన పార్థసారథి తీవ్ర స్థాయిలో బెదిరింపులకు గురిచేశాడు. ఈ వ్యవహారంపై సమగ్రమైన విచారణ చేసి ఖరీదైన జలమండలి స్థలం కబ్జాకు యత్నిస్తున్న పార్థసారథితో పాటు అతడికి సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం రాత్రి జలమండలి తట్టిఖానా సెక్షన్ మేనేజర్ రాంబాబు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడు పరశరామ్ పార్థసారథితో పాటు అతడి అనుచరులపై వివిధ సెక్షన్ల కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వారి వల్లే స్టేషన్ పరువు పోతున్నది!

- మహిళా కానిస్టేబుళ్లను బూతులు తిట్టిన సీఐ
- సీఐ ప్రవర్తనతో బోరుమన్న కానిస్టేబుళ్లు
- పీఎస్ వేదికగా సీఐ వర్సెస్ డీఐ
- సీపీని కలుస్తామంటున్న మహిళా కానిస్టేబుళ్లు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో కొత్తగా ఏర్పాటైన పోలీస్ స్టేషన్ అది. అక్కడ పోలీసు అధికారుల మధ్య పచ్చగడ్డేస్తే భగ్గుమంటోంది. సీఐ వర్సెస్ డీఐ పోరు కానిస్టేబుళ్లవైపు తిరిగింది. ఉన్నతాధికారుల పర్యటన సందర్భంలో జరిగిన గొడవ ఆ పీఎస్ అధికారులు బహిరంగంగానే తిట్టుకునే సందర్భం కనిపించింది. నువ్వేం పనిచేస్తున్నవ్ అంటే నువ్వేం చేస్తున్నవ్ అంటూ ఒకరిపై ఒకరు అనుకోవడమే కాకుండా చూసుకుందాం రా అంటూ సవాల్ విసురుకున్నారు. స్టేషన్ లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు చూస్తుండగానే ఈ సంఘటన జరిగింది. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనలో సీఐ గొడవకు దిగిన సందర్భంలో మహిళా కానిస్టేబుళ్లతో అసభ్యంగా మాట్లాడడంతో వారు తిరగబడ్డారు. అసలు మమ్మల్ని అనడానికి నువ్వెవరూ అంటూ సీరియస్ అయ్యారు. మా క్యారెక్టర్లను కించపరిస్తే ఊరుకునేది లేదంటూ గొడవకు దిగారు. అయినా సీఐ తన పంథా మార్చుకోకుండా అదే రీతిలో బూతులు తిడుతుండడంతో ఎట్టి పరిస్థితుల్లో సీఐపై హైదరాబాద్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడానికి డిసైడయ్యారు.

మహిళ లని కూడా చూడకుండా..!

ఈ పోలీస్ స్టేషన్ ఏర్పాటైన నాటి నుంచి స్టేషన్ ఆఫీసర్లపై వివాదాలు ఉంటూనే ఉన్నాయి. ఇప్పుడు ఉన్న ఆఫీసర్ కూడా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌తో గొడవ పడడమే కాకుండా ఏం పని చేస్తున్నావ్ అంటూ గొడవకు దిగారు. డీసీపీ పర్యటన నేపథ్యంలో ఆ పరిధిలో ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహనాల చెకింగ్ తర్వాత సంఘటన జరిగింది. ఇద్దరు అధికారులు గొడవ పడుతున్న సమయంలో మహిళా కానిస్టేబుళ్ల వల్లే ఈ స్టేషన్ ఇలా తయారైందని అంటూనే వారిపై అసభ్యంగా మాట్లాడుతూ బూతులు తిట్టడంతో గొడవ ముదిరింది. తమకు సంబంధం లేని గొడవలో తమను లాగడమే కాక బూతులు తిట్టడమేంటంటూ మహిళా కానిస్టేబుల్స్ ప్రశ్నించారు. దీంతో ఒక కానిస్టేబుల్‌తో మరింత అసభ్యకరంగా మాట్లాడిన సీఐ నువ్వెవరికి చెప్పుకుంటావో చెప్పుకో పో అంటూ వెళ్లిపోయాడు. తనకు పై అధికారి అండదండలు ఉన్నాయన్న కారణంగా సబార్డినేట్స్‌ను ఇలా వేధిస్తారని కానిస్టేబుళ్లు చెప్పారు. ఈ సీఐపై మొదటినుంచి ఆరోపణలున్నాయి. కేసుల నమోదులో ఉదాసీనతతో పాటు, ప్రైవేటు పంచాయితీలు, నెలవారీ మామూళ్లతో తన పై అధికారులను ప్రసన్నం చేసుకుంటాడని చెప్పుకొంటున్నారు. అయితే తమ పట్ల సీఐ మాట్లాడిన తీరుపై మహిళా కానిస్టేబుళ్లు ఏసీపీని కలిశారు. ఆయన మాట్లాడతానంటూ భరోసా ఇచ్చి సీఐతో మాట్లాడే ప్రయత్నం చేసినా ఆయన కనీసం తాను తప్పుగా మాట్లాడానన్న ఫీలింగ్ కూడా లేదని, మరోసారి కూడా వాళ్ల వల్లే పీఎస్ ఇజ్జత్ పోతున్నదని కామెంట్ .. దీనిపై తాము సీపీని కలిసి తమ సమస్యలు చెప్పుకుంటామని మహిళా కానిస్టేబుళ్లు పేర్కొన్నారు. సీఐ వేధింపుల వల్ల తాము మానసికంగా చాలా ఇబ్బంది పడుతున్నామని, తమను వ్యక్తిగతంగా, ఉద్యోగపరంగా సీఐ వేధిస్తున్నారని, సోమవారం సీపీ సీవీ ఆనంద్‌ను కలిసి సీఐ వ్యవహారశైలిపై ఫిర్యాదు చేసేందుకు మహిళా కానిస్టేబుళ్లు సిద్ధమయ్యారని తెలిసింది.

తండ్రిని పొడిచి చంపిన తనయుడు

మద్యం తాగి వేధిస్తున్నాడని.. హత్య

చర్లపల్లి, ఫిబ్రవరి 22 : నిత్యం మద్యం సేవించి కుటుంబ సభ్యులను వేధిస్తున్న తండ్రిని కన్న కొడుకే హత్య చేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పెద్దపల్లి జిల్లా వెన్నెంపల్లి గ్రామానికి చెందిన అరెల్లి మొగిలి(45) తన భార్య లావణ్యతో కలిసి సికింద్రాబాద్ లాలాపేట ఇందిరానగర్‌కు వచ్చి తన కుమారుడు సాయికుమార్(25), కూతురు శ్రావణితో కలిసి నివాసముంటున్నాడు. మొగిలి, సాయికుమార్ తండ్రీ కొడుకులు లాలాపేట ల్లోని ప్యాకర్స్, మూవర్స్‌లో పని చేస్తున్నారు. మొగిలి నిత్యం మద్యం తాగి పేకాట ఆడేందుకు డబ్బులు ఇవ్వాలని కుటుంబ సభ్యులను నిత్యం వేధిస్తున్నాడు. శనివారం ఉదయం మద్యంకు డబ్బులు ఇవ్వాలని భార్య, కుమారుడుతో మొగిలి గొడవ పెట్టుకున్నాడు. అనంతరం మొగిలి మధ్యాహ్నం బస్సులో ఈసీఐఎల్ చౌరస్తాకు వచ్చాడు. మానసికంగా విసిగిపోయిన కుమారుడు సాయికుమార్ ఎలాగైనా తన తండ్రి ఇబ్బందుల నుంచి కుటుంబాన్ని కాపాడుకోవాలని తనతో పాటు ఇంట్లో నుంచి తీసుకువచ్చిన కత్తితో ద్విచక్రవాహనంపై తండ్రిని వెంబడించాడు. ఈసీఐఎల్ చౌరస్తాలో బస్సు దిగి రోడ్డుపైకి వచ్చిన మొగిలిని పోలీస్‌స్టేషన్ సమీపంలోనే కుమారుడు సాయికుమార్ విచక్షణ రహితంగా 15 చోట్ల కత్తితో పొడిచాడు. దీంతో స్థానికులు, ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చెరుకున్న పోలీసులు మొగిలి కుమారుడు సాయికుమార్‌ను అదుపులోకి తీసుకొని మొగిలిని మెరుగైన వైద్యం కోసం స్థానికంగా ఉన్న ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మొగిలి మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

పనితీరే ప్రామాణికం: ఆబ్కారీ ఈడీ కమలాసన్‌రెడ్డి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): కష్టపడి పనిచేసే ఉద్యోగులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, ఉద్యోగుల గుర్తింపునకు వారి పనితీరే ప్రామాణికమని ఆబ్కారీ ఈడీ కమలాసన్‌రెడ్డి అన్నారు. శనివారం నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదరాబాద్, రంగారెడ్డి, ధూల్‌పేట ప్రాంతాల్లో మత్తు పదార్థాలను అరికట్టడంలో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందికి ఈడీ కమలాసన్‌రెడ్డి నగదు పురస్కారాలను అందజేశారు.

చికెన్, ఎగ్ మేళా

సిటీబ్యూరో: పౌల్ట్రీ ట్రీడర్స్ కో ఆర్డినేషన్ అసోసియేషన్, జాతీయ కోడిగుడ్ల సమన్వయ సమితి ఆధ్వర్యంలో శనివారం తెలంగాణలోని పలుచోట్ల చికెన్, గుడ్ల మేళా నిర్వహించారు. నగరంలోని ఓల్డ్ అల్వాల్, బోయిన్‌పల్లి, నాంపల్లి, అత్తాపూర్, సరూర్‌నగర్, హయత్‌నగర్, మన్సూరాబాద్‌లతో పాటు కామారెడ్డిలో రామాయంపేట్, వరంగల్‌లో హన్మకొండ, నర్సాపూర్‌లో ప్రగతినగర్‌లో, కల్వకుర్తి మార్కెట్ ఏరియా, గజ్వేల్ ఆర్టీసీ బస్టాండ్, పరిగి బాహర్‌పేట, చేవెళ్ల మొయినాబాద్ ప్రాంతాల్లో ఈ మేళా జరిగింది. 70 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద బర్డ్‌ఫ్లూ వైరస్ చనిపోతుందని, భారతదేశంలో 100 డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే ఎక్కువ వేడిలోనే వండుతారని ప్రజలు ఏ విధమైన అపోహలకు గురి కాకుండా గుడ్డు, చికెన్‌ను నిస్సందేహంగా తినాలని నిర్వాహకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మార్చి 31లోపు పరిశీలన పూర్తయ్యేనా?

హెచ్ఎండీఏ పరిధిలో లక్షల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు

సిటీబ్యూరో: లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం హెచ్ఎండీఏ పరిధిలో అత్యంత క్లిష్టంగా మారింది. అరకొర సిబ్బంది, రెండు విభాగాల మధ్య సమన్వయంతో జరగాల్సిన వ్యవహారాలతో దరఖాస్తుల పరిశీలన అసాధ్యమనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. నిర్ణీత గడువులోగా పెండింగ్‌లో ఉన్న లక్షల దరఖాస్తులకు మోక్షం కలిగించడం అనుకున్నంత సులభమేమి కాదని తెలుస్తోంది. ఏడు జిల్లాల్లో విస్తరించిన హెచ్ఎండీఏ పరిధిలో మొత్తం 3.60లక్షల మంది ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో కొన్ని దరఖాస్తుల పరిశీలన పూర్తి అయినా.. ఇందులో 30-40శాతానికి పైగా దరఖాస్తుదారులకు ఫీజులు చెల్లించాలని సమాచారాన్ని అందించారు. అయితే మిగిలి ఉన్న లక్షల దరఖాస్తుల క్రమబద్ధీకరణకు వీలు ఉన్న దరఖాస్తులు ఎన్ని, ఇందులో సాంకేతిక సమస్యలు, ఇతర షార్ట్ ఫాల్ వంటివి పరిశీలన చేయాల్సి ఉండగా.. మూడు దఫాలుగా జరిగే ఈ ప్రక్రియ అనుకున్నంత వేగంగా, సులభంగా జరిగే అవకాశం కనిపించడం లేదు. దీంతో మార్చి 31లోపు ఆ దరఖాస్తులు క్లియర్ కాకపోతే.. ప్రభుత్వం ఇచ్చే 25శాతం రాయితీ అవకాశాలను దరఖాస్తుదారులు కోల్పోనున్నారు.

80వేలకుపైగా పెండింగ్‌లోనే..

హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 3.60 లక్షల మంది ఓపెన్ ప్లాట్లను క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోగా, ఇందులో 1.16లక్షల దరఖాస్తులను పరిశీలించారు. వీటిలో 80వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటితోపాటు మరో 75వేల దరఖాస్తులను షార్ట్ ఫాల్స్ చూపుతూ కొర్రీలు పెట్టారు. ప్రిలిమినరీ ఎలిమినేషన్ ప్రక్రియ ముగియగా.. ఫీజులు చెల్లించిన దరఖాస్తులను పరిశీలించి షార్ట్ ఫాల్స్ పేర్కొంటూ దరఖాస్తుదారులకు సమాచారం ఇస్తున్నారు. ఈ క్రమంలో ఉన్న ఫలంగా నిర్ణీత గడువుతో దరఖాస్తులను పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు అయోమయానికి గురవుతున్నారు. దీంతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కారించడం అనివార్యంగా మారింది. ఇదంతా హెచ్ఎండీఏ సిబ్బందికి పనిభారం పెంచనుండగా, అసలే వేధిస్తున్న సిబ్బంది కొరతతో మరింత జాప్యం జరిగే అవకాశం ఉంది.

ఓల్డ్ సిటీ మెట్రోకు అడ్డంకులు

చారిత్రక కట్టడాలను పరి రక్షించాలంటూ పిటిషన్లు

మెట్రో విస్తరణలో మరింత జాప్యం

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : ఓల్డ్ సిటీ మెట్రోకు గ్రహణం వీడడం లేదు. గత కొంతకాలంగా ఈ ప్రాజెక్టుకు అన్ని అడ్డంకులే వస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం ఓల్డ్ సిటీ మెట్రోను చాంద్రాయణ గుట్ట వరకు విస్తరించేలా పనులు చేపట్టింది. కానీ ఈ మార్గంలో కోల్పోతున్న చారిత్రక కట్టడాలు మెట్రో నిర్మాణానికి ప్రధాన అడ్డంకిగా మారుతున్నాయి. ప్రాజెక్టును చేపట్టే క్రమంలో అధ్యయనం చేసిన హైదరాబాద్ మెట్రో సంస్థ వెయ్యికి పైగా చారిత్రక, ఆధ్యాత్మిక, మతపరమైన కట్టడాలను గుర్తించింది. ఈ క్రమంలో వీటిని తొలగించి, ప్రాజెక్టు చేపట్టేలా నిర్వాహకులతో సంప్రదింపులు జరిపినా..ప్రాజెక్టు ముందుకు జరగడం లేదు. ప్రాజెక్టు నిర్మాణానికి కీలకమైన భూసేకరణ తలకు మించిన భారంగా మారుతున్నది. ప్రైవేట్ ఆస్తులను సేకరించే క్రమంలో ఎదురైన ఇబ్బందులను సంప్రదింపులతో తొలగిస్తున్నా... మతపరమైన, చారిత్రక కట్టడాల విషయంలో అడుగు ముందుకు పడడం లేదు. చారిత్రక కట్టడాలను పరిరక్షించాలంటూ కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు వస్తున్నాయి. ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఈ కట్టడాలకు ప్రమాదం పొంచి ఉందని వాదిస్తున్నారు.

విస్తరణకు వ్యతిరేకంగా..

హైదరాబాద్ మెట్రో విస్తరణకు వ్యతిరేకంగా కోర్టులను ఆశయిస్తునారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, హైదరాబాద్ మెట్రో ఎండీ, వక్ఫ్ బోర్డు సీఈవోలను ప్రతివాదులుగా చేర్చుతూ... పాతబస్తీలో మెట్రో నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తమవుతున్నది. చారిత్రక కట్టడాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్మాణం చేపడుతున్నారని పేర్కొంటూ.. పాతబస్తీలో మెట్రో నిర్మాణంపై పలువురు కోర్టుకు వివరించారు.

తెలంగాణ వారసత్వ చట్టం 2017 ప్రకారం..

తెలంగాణ వారసత్వ చట్టం 2017 ప్రకారం చారిత్రక కట్టడాలను రక్షించాలని కోరుతున్నారు. పాతబస్తీ ప్రతిపాదిత మెట్రోమార్గం సమీపంలో చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్, పురానా హవేలి, ముఘల్ పురా సమాధులు వంటి చారిత్రక కట్టడాలు ఉన్నాయని వాదనలు వినిపిస్తున్నారు. మెట్రో రైలు నిర్మాణం కారణంగా ఈ స్మారక చిహ్నాలకు నష్టం జరిగే ప్రమాదం ఉందంటున్నారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ కోసం పనులు చేపట్టే ముందు నిపుణుల బృందం పర్యవేక్షణలో జరగాలని కోరుతున్నారు. లేదంటే ప్రాజెక్టును నిలిపి వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కొనసాగుతున్న భూసేకరణ

ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణలో కీలకమైన భూసేకరణ పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 7.5 కిలోమీటర్ల పొడువైన మెట్రోను ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయాణగుట్ట వరకు నిర్మించనున్నారు. ఫేస్-2లో ఇదీ మొదటి కారిడార్ కానుండగా ప్రాజెక్టు కోసం 1100 ఆస్తులను సేకరించేందుకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో 800 ఆస్తులకు ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను పలు దఫాలుగా జిల్లా రెవెన్యూ అధికారులు చేపట్టారు. మొదటి దశ ప్రైవేట్ ఆస్తులకు పరిహారాన్ని చెల్లించడం మొదలైంది. అదే సమయంలో కొన్నిచోట్ల కూల్చివేతలు ప్రారంభించారు. ప్రాజెక్టుకు భూములు స్వచ్ఛందంగా ఇచ్చే యజమానులతో సంప్రదింపులు చేస్తూనే, సమస్యాత్మక ఆస్తుల సేకరణపై అధికారులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు.